# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-06-2025** **సమయం : 8.30 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ వ్యాప్తంగా ఈరోజు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**
2. **ఒకే భూమి- ఒకే ఆరోగ్యం స్ఫూర్తితో యోగాను రోజూవారి జీవితంలో భాగం చేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.**
3. **ప్రపంచ వ్యాప్తంగా యోగా ప్రాచుర్యం పొందుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.**
4. **ఉభయ తెలుగు రాష్ట్రాలు కలిసి చర్చించుకుంటే గోదావరి-బనకచర్ల సమస్య పరిష్కారమవుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో ప్రతినెలా 26 నుంచి 30వ తేదీలోపు వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయనున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

==========================

"ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా" ఇతి వృత్తంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుగుతోంది. 2014 సెప్టెంబర్ 7వ తేదీన ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగిస్తూ... భారతీయుల అతి ప్రాచీనమైన, అమూల్యమైన విశిష్టమైన ఈ యోగా ప్రక్రియ గురించి తెలియచేశారు. యోగా ప్రక్రియ అంతర్జాతీయ స్థాయిలో జరిగేలా తోడ్పాటు అందించాలని ప్రధానమంత్రి ఆ సమావేశంలో చేసిన ప్రతిపాదన ఫలితంగానే జూన్ 21వ తేదీని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ యోగా దినోత్సవంగా అధికారికంగా ప్రకటించడం విశేషం.కేంద్ర ఆయూష్ మంత్రిత్వశాఖ పిలుపు మేరకు యోగా దినోత్సవాన్ని ఈరోజు దేశవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో ఘనంగా నిర్వహిస్తున్నారు.

--------------------------

ఒకే భూమి . ఒకే ఆరోగ్యం స్ఫూర్తితో యోగాను రోజూవారి జీవితంలో భాగం చేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఉదయం విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొని.. ఆసనాలు వేశారు. అంతకుముందు ప్రధానమంత్రి ప్రసంగిస్తూ...యోగా ప్రపంచ దేశాలను ఏకం చేసిందని తెలిపారు. దేశంలోని మారుమూల గ్రామాల్లో సైతం

ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చే యోగాను అభ్యసించడం హర్షించదగ్గ పరిణామమని తెలుపుతూ...

..వాయిస్...33 సెకన్లు

కాగా... యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తపాలా శాఖ స్మారక స్టాంప్‌ను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, పలువురు కేంద్రమంత్రులు, మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా యోగా ప్రాచుర్యం పొందుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ వద్ద ఈ ఉదయం నిర్వహించిన యోగా కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... యోగాను అన్ని క్రీడల్లో భాగం చేయాలని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 175 దేశాల్లో 12 లక్షలకు పైగా ప్రాంతాల్లో ఈరోజు యోగాను నిర్వహించడం గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

..వాయిస్.. 33 సెకన్లు

ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... ఒత్తిడిని జయించడానికి యోగా దోహదపడుతుందని తెలిపారు. ప్రపంచం యోగా దినోత్సవం నిర్వహించుకోవడం భారత్‌కు దక్కిన గౌరవమని పవన్ కళ్యాణ్ తెలుపుతూ...

..వాయిస్... 21 సెకన్లు

---------------------------

విశాఖపట్నంలోని అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రామకృష్ణ బీచ్ నుంచి భీమిలీ వరకు 28 కిలో మీటర్ల పొడవునా యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో లక్షలాదిగా యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు. కాగా.. విశాఖపట్నం సముద్రంలో భారత నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మరోవైపు.. తెలంగాణా ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి క్రీడామైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్రమంత్రులు, ప్రజాప్రతినిధులు, తెలుగు చలనచిత్ర నటులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 5 వేల 5 వందల మంది యోగా అభ్యాసకులు పాల్గొన్నారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాలు కలిసి చర్చించుకుంటే గోదావరి-బనకచర్ల సమస్య పరిష్కారమవుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. ఏ రాష్ట్రంతోనూ వివాదాలు కోరుకోవడంలేదని అన్నారు. అదే సమయంలో తెలంగాణ హక్కులనూ వదులుకోబోమని స్పష్టం చేశారు. ఈ విషయంపై ఈనెల 23న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో చర్చలకు సిద్ధమని, ముందు ముఖ్యమంత్రుల స్థాయిలో చర్చించుకొని తర్వాత ఎపెక్స్ కౌన్సిల్‌ను సంప్రదిస్తామని తెలిపారు.

---------------------------

ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా స్థిరమైన మౌలిక సదుపాయాలను సృష్టించడానికి ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. విశాఖపట్నంలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య –సిఐఐ సదస్సులో ఆయన నిన్న పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి పోర్ట్ ఆపరేటర్లు, లాజిస్టిక్స్ ప్రొవైడర్లు, షిప్పింగ్ లైన్లు, మౌలిక సదుపాయాల డెవలపర్లు, ప్రపంచ భాగస్వాములు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దక్షిణాసియా లాజిస్టిక్స్ ముఖద్వారంగా ఆంధ్రప్రదేశ్ తనదైన పాత్ర పోషించనుందని మంత్రి వివరించారు.

---------------------------

ప్రతినెలా 26 నుంచి 30వ తేదీలోపు వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చౌకధరల దుకాణాల నిర్వాహకులను ఆదేశించారు. అమరావతిలోని చౌకధరల దుకాణదారుల ప్రతినిధులతో మంత్రి నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలలో మొదటి 15 రోజుల్లో 89.64 శాతం మేర రేషన్ పంపిణీ చేశామని తెలిపారు. గిరిజన, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు సరకులను అందించడానికి డీలర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు.

---------------------------

ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక, పర్యావరణ తెలంగాణను నిర్మించేందుకు ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా సదరన్ రీజియన్ సీఎస్ఆర్ అండ్ సస్టెయినబిలిటీ సదస్సు, అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిన్న నిర్వహించారు. కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు, సామాజిక బాధ్యత కింద ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం అనువైన వేదికను కల్పిస్తుందని ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి తెలుపుతూ,

వాయిస్.. 29 సెకన్లు

---------------------------

భారత్ – ఇంగ్లాడ్ మధ్య అయిదు టెస్టుల క్రికెట్ సిరీస్ లో భాగంగా ఇంగ్లాడ్‌లోని హెడింగ్ లీ లీడ్స్‌లో మొదటి టెస్టు నిన్న ప్రారంభం అయింది. మొదట ఇంగ్లాడ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగుకు దిగిన భారత్ మొదట రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు నష్టానికి 359 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 127 పరుగుల, పంత్ 65 పరుగులతో బ్యాటింగ్ కొనసాగిస్తున్నారు. బ్యాటింగ్ ఈరోజు కూడా కొనసాగుతుంది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్... 30 సెకన్లు

=====================